

న్యాయం కావాలి.. నిందితులను శిక్షించాలి

కంభం మండలం లింగోజీపల్లిలో మూడేళ్ల బాలుడు పాదిలి లక్షిత్ అనుమానాస్పద మృతి కేసులో తమకు న్యాయం చేయాలని గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేశారు. - 8లో..



అడుగడుగునా ఆంక్షలు

కొండపిలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని అడ్డుకునేందుకు మంత్రి ఆదేశాలతో పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38 /29

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

నేడు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఉద్యోగుల రాష్ట్ర సదస్సు


ఒంగోలు వన్‌టౌన్: విభిన్న ప్రతిభావంతుల శాఖ ఉద్యోగుల రాష్ట్ర సదస్సును శనివారం ఉదయం 10 గంటలకు ఒంగోలు హైదరీ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు ఆ శాఖ ప్రకాశం జిల్లా నాయకులు కొర్రపాటి రామచంద్ర రావు, అంబటి శివప్రసాద్ ఒక సంయుక్త ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సంస్థలో పనిచేస్తున్న, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన వివిధ రకాల బకాయిలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు కే ఈశ్వరరావు హాజరవుతారన్నారు.

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉద్యోగావకాశాలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో అతిథి బోధన విధానంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ ఈశ్వర్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. మోడల్ పాఠశాలలో సీబీఎస్ఈలో బోధించేందుకు పీజీటీ, కెమిస్ట్రీ-1, పీజీటీ, బయాలజీ-1, పీజీటీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్-1, ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీఈటీ పురుషులు)-1 గా చేరేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. 21 నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. నవోదయ, కేంద్రియ విద్యాలయాల్లో, స్టేట్ గవర్నమెంట్ సంస్థల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన వారు 60 నుంచి 65 ఏళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 16వ తేదీలోపు అందించాలని, పూర్తి సమాచారం కోసం 94160 94165 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

పొగాకు సాగుపై కత్తిగట్టారు..!

ప్రభుత్వ నిర్లక్ష్యం..బయ్యర్ల మాయాజాలం..జిల్లాలో పొగాకు రైతు ధరరాక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. అండగా నిలవాల్సిన బోర్డు ముఖం చాటేసింది. ప్రభుత్వం ఆర్భాట ప్రకటనలకే పరిమితం కావడంతో ఈ ఏడాది పొగాకు రైతు నట్టేట మునిగిపోయాడు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు.. ఆ నెపాన్ని రైతులపైకి తోసేందుకు బోర్డు అధికారులు, బయ్యర్లు, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు శతవిధాలా ప్రయత్నించారు. రేటు రాకపోవడానికి రైతులదే తప్పు అన్నట్టుగా బోర్డు అధికారులు రానున్న సంవత్సరానికి సాగు విస్తీర్ణాన్ని తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఏడాదితో పోల్చుకుంటే వచ్చే ఏడు ఉత్పత్తిని 142 మిలియన్ కేజీలు సాగుచేయాలని అనుమతినిచ్చింది.



- ఉత్పత్తిలో భారీగా కోత
- వచ్చే ఏడాది 142 మిలియన్ కేజీలే పండించాలని పొగాకు బోర్డు కండిషన్
- ప్రస్తుతం 167 మిలియన్ కేజీల వరకు అనుమతి
- 25 మిలియన్ కేజీల కోత విధింపు
- బ్యారన్ పరిధిలో కూడా కోతలే
- నల్లరేగడి నేలల్లో 4,175 కేజీలకు కుదింపు
- తేలికరకం నేలల్లో 3,565 కేజీలకు తగ్గింపు
- పొగాకు కనిష్ట ధర రూ.150కు పడిపోవడంతో బెంబేలెత్తుతున్న రైతులు

సాక్షి ప్రతినిధి ఒంగోలు:

రీజియన్ పరిధిలో దాదాపు 30 వేల మంది రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. 69,095 హెక్టార్లలో సాగు చేసేందుకు బోర్డు అనుమతినిచ్చింది. సాగు సమయంలో పలు కంపెనీలు హామీలు ఇవ్వడంతో రైతులు ఏకంగా 88 వేల హెక్టార్లలో సాగు చేశారు. 167 మిలియన్ కేజీల వరకు పండించారు. గత ఏడాది 88.69 మిలియన్ కేజీలు కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతినిచ్చినా అంతకు మించి 154.41 మిలియన్ కేజీలు కొనుగోలు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, కంపెనీలు సైతం హామీ ఇవ్వడంతో రైతులు ఎక్కువ సాగు చేశారు. అయితే వేలం కేంద్రాలు ప్రారంభమయ్యాక కొనుగోలు కంపెనీలు దొంగాట మొదలెట్టాయి. అధికారులు సైతం వాటి పక్షానే నిలవడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. వైఎస్సార్ సీపీ హయాంలో నాలుగేళ్లు లాభాలు చవిచూసిన రైతులు సాగు వ్యయం రెట్టింపు అయినా వెనుకాడకుండా సాగుచేశారు. వేలం కేంద్రాల్లో కంపెనీల మోసాలతో కడుపుమండిన రైతులు రోడ్డెక్కారు. పలు కేంద్రాల్లో వేలాన్ని బహిష్కరించారు. కంటితుడుపు చర్యగా అప్పటికప్పుడు రేట్లు పెంచేసి కొనుగోళ్లు చేస్తూ వస్తున్నారు. వేలం కేంద్రాలకు వస్తున్న బేళ్లను నాణ్యత పేరుతో తిరస్కరిస్తూ దోపిడీ పర్వానికి తెరదీశారు. దానికి బోర్డు అధికారులు సహకరిస్తూ రావడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇప్పటికే ఇద్దరు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు కూడా. అయినా బోర్డు అధికారుల్లో, పాలకుల్లో చలనం కనిపించలేదు.

కనిష్ట ధర రూ.150కు ధమాల్

రెండు వారాల నుంచి పొగాకు కనిష్ట ధర కేజీ రూ.150కు పడిపోయింది. జిల్లాలోని 11 వేలం కేంద్రాల్లో ధర పేరుకు మాత్రం రూ.281 పలుకుతున్నట్లు చూపిస్తున్నా సరాసరి ధర మాత్రం రూ.221 వద్దే నిలిచిపోయింది. కనిష్ట ధర రూ.150కు పడిపోయింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. గిట్టుబాటు ధర లేకపోవడం, నాణ్యత బాగులేదనే నెపంతో నోబిడ్ పేరుతో దాదాపు 40 శాతానికి పైగా పొగాకు బేళ్లను బోర్డు అధికారులు తిరస్కరించటాన్ని రైతులు తట్టుకోలేకపోతున్నారు. ఇప్పటి వరకు కనీసం 60 శాతానికి మించి పొగాకు కొనుగోళ్లు జరగకపోవడం, మిగిలిన పొగాకును ఎప్పుడు కొనుగోలు చేస్తారోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. కొత్త సీజన్ కూడా మళ్లీ మొదలవటంతో పొగాకు సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు భయపడుతున్నారు.

బయ్యర్లను ఒప్పించలేక మార్క్‌ఫెడ్‌ను దించక..

గత ఏడాది పొగాకు గరిష్ట ధర రూ.366 పలికింది. వరుసగా నాలుగేళ్లు లక్షల్లో లాభాలు అందుకున్న రైతులు ఈ ఏడాది వచ్చిన నష్టాలను జీర్ణించుకోలేకపోతున్నారు. పొగాకు కొనుగోళ్లకు వచ్చిన దాదాపు 10-12 కంపెనీలకు చెందిన యజమానులను ఒప్పించి గిట్టుబాటు ధర ఇప్పించటంలో పొగాకు బోర్డు విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొగాకు ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేయొచ్చనే ఉద్దేశంతో సిండికేట్ అయిన బయ్యర్ల ఎత్తుగడలకు రైతులు ఉక్కిరిబిక్కిరయ్యారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి పొగాకును కొనుగోలు చేయిస్తారనుకున్న రైతుల ఆశల గురించి బోర్డు పట్టించుకోనే లేదు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోని పొదిలిలో పర్యటించే ముందు మాత్రం కాస్త పొగాకు ధరలను పెంచి రైతుల్లో ఆశలు రేకెత్తించినా జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ముగిసిన మరుసటి రోజు పొగాకు ధరలు మళ్లీ యథాస్థితికి వచ్చాయి.

కేసులు పెట్టడంపై ఉన్న ఆసక్తి రైతులపై లేదు..

వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పొదిలి పర్యటనకు వచ్చిన స్పందన చూసిన రాష్ట్ర ప్రభుత్వం ఓర్వలేక రైతులు, వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తోంది. తమకు అండగా నిలిచి మద్దతు ధర ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. మార్క్‌ఫెడ్ కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేస్తున్నామని చెబుతున్నా ప్రతి రోజూ వేలం కేంద్రాల్లో నమోదవుతున్న ధరలు, తిరస్కరణకు గురవుతున్న బేళ్లను పరిశీలిస్తే ప్రభుత్వ మోసం బట్టబయలవుతుందని రైతు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

సాగు విస్తీర్ణాన్ని కుదించేస్తూ..

వచ్చే ఏడాది రీజియన్ పరిధిలో పొగాకు సాగు ఉత్పత్తిని 142 మిలియన్ కేజీలకే పరిమితం చేస్తూ ఆదేశాలిచ్చింది. అది ప్రస్తుత ఏడాది 167 మిలియన్ కేజీల వరకు ఉంది. దానిలో నుంచి ఏకంగా 25 మిలియన్ కేజీలను తగ్గించింది. అంతటితో ఆగకుండా ఒక్కో బ్యారన్ పరిధిలో ఉత్పత్తి చేసే పొగాకు పరిమాణాన్ని కూడా భారీగా కుదించింది. నల్లరేగడి నేలల పరిధిలో ఒక్కో బ్యారన్‌కు ఈ సంవత్సరం 4,175 కేజీలను పండించేందుకు అనుమతినివ్వగా, వచ్చే ఏడాది 3,565 కేజీలకు పరిమితం చేసింది. అంటే ఒక్కో బ్యారన్‌కు 610 కేజీల పొగాకు ఉత్పత్తిని తగ్గించింది. అలాగే తేలికరకం నేలల పరిధిలోని బ్యారన్‌కు 4,275 కేజీల నుంచి 3,665 కేజీల వరకు అంటే 610 కేజీల పొగాకు ఉత్పత్తిని తగ్గించింది. దాని ఫలితంగా పొగాకు బోర్డు పరిధిలో 25 మిలియన్ కేజీల ఉత్పత్తికి కోత విధించింది.

- రాష్ట్రంలో అరాచక పాలన
- పోలీసులు కూటమి కార్యకర్తల్లాగా పనిచేస్తున్నారు
- ఎన్నికల హామీల్లో కూటమి ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి ఆర్కే రోజా విమర్శలు



రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్కే రోజా, కారుమూరి నాగేశ్వరరావు, ఆదిమూలపు సురేష్, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, సతీష్‌రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, బత్తుల బ్రహ్మానందరెడ్డి, తూమాటి మాధవరావు తదితరులు

మంచి ప్రభుత్వం కాదు ముంచే ప్రభుత్వం



కొండపి: రాష్ట్రంలో ప్రస్తుతం మంచి ప్రభుత్వం లేదని, ప్రజలను ముంచే ప్రభుత్వం మాత్రమే ఉందని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. కొండపిలో శుక్రవారం మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అధ్యక్షతన రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన రోజా మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలే లక్ష్యంగా దాడులకు తెగబడుతూ కూటమి ప్రభుత్వం అరాచకాలు సృష్టిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేశామని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పే ధైర్యం కూటమి నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ ఎగిరి పడితే రాబోవు రోజుల్లో ప్రజలు ఎగరేసి తంతారని విమర్శించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ తోడు దొంగల్లాగా తయారై రాష్ట్రంలో ఎన్నో అరాచకాలు, అత్యాచారాలు హత్యలు జరుగుతున్నా అవేమీ తమకు పట్టవంటూ వ్యవహరిస్తున్నారన్నారు. ప్రశ్నించడానికి పార్టీ స్థాపించానని బీరాలు పలికిన పవన్ కళ్యాణ్ నేడు పవర్ లేని స్టార్ గా మిగిలిపోయాడని విమర్శించారు.విద్యా వ్యవస్థ ఏ విధంగా ఉండాలో మాజీమంత్రి ఆదిమూలపు సురేష్‌ని చూసి నేర్చుకోవాలని.. ఏ విధంగా ఉండకూడదో నారా లోకేష్‌ని చూస్తే తెలిసిపోతుందన్నారు.

యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియా టార్గెట్ జగన్ అన్నారు. జగనన్న పై కేసులు బనాయించి భూస్థాపితం చేస్తామనడం కూటమి నాయకుల కుట్రలకు అద్దం పడుతోందన్నారు. ఏడాది తర్వాత తల్లికి వందనం పథకాన్ని అరకొరగా అమలు చేసి ప్రజలకు ఏదో వెలగబెట్టినట్లు ఆ పథకం తన కుమారుడు లోకేష్ కనిపెట్టినట్లు చంద్రబాబు చెప్పుకోవడం ఆయన చేతగానితనానికి నిదర్శనం అన్నారు. కల్తీ మద్యం తయారుచేసి వారి బతుకులతో ఆడుకుంటున్నారన్నారు. ఈరోజు మద్యం సీసాలకు పవర్ స్టార్ పేరు పెట్టడం వలన పవన్ కళ్యాణ్ ప్రశ్నించకుండా మిన్నకుండిపోయారన్నారు. చంద్రబాబు మూడు మాటలు మాట్లాడితే వాటిలో రెండు అబద్ధాలు.. ఒకటి సొల్లు అని విమర్శించారు.

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయవచ్చని చెప్పిన చంద్రబాబు నేడు ఉచిత బస్సును జిల్లాకే పరిమితం చేయడం



మరోసారి మహిళలు మోసం చేయడమేనన్నారు. వేల కోట్ల విద్యుత్ చార్జీలు పెంచి పేద ప్రజలపై ఆర్థిక భారం మోపి ఆ నేరాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై వేయటానికి చంద్రబాబు, ఎల్లో మీడియా ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ఆదిమూలపు సురేష్‌కి అండగా నిలవాలన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి మాట్లాడుతూ ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించి చిత్రహింసలకు గురి చేయటం మంచి పద్ధతి కాదన్నారు. లోకేష్ రెడ్‌బుక్ మడిచి గూట్లో పెట్టి రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాలన్నారు. వినేవాళ్లు వెధవలైతే చెప్పేవాడు చంద్రబాబు అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగనన్న 2.0లో ఒక కన్ను ప్రజలైతే రెండవ కన్ను కార్యకర్తలేనని ఉత్సాహపరిచారు.

జగనన్న 2.0లో కార్యకర్తలకు పెద్దపీట:



జగనన్న 2.0లో కార్యకర్తలకు పెద్దపీట వేస్తున్నామని దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. చంద్రబాబు రాజధాని నిర్మాణం పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని మింగేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీలోకి ఎవరెవరో వస్తుంటారు పోతుంటారని, ఎవరు పార్టీ వీడి వెళ్లినా వైఎస్సార్‌సీపీకి వచ్చిన నష్టం లేదని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి 2029లో జిల్లాలోని అన్ని స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఇప్పటి వరకు ఒక లెక్క ఇక నుంచి మరో లెక్క:

కొండపి నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఒక లెక్క ఇప్పటి నుంచి మరొక లెక్క అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలు హాజరవుతుంటే పోలీసులు అడుగడుగునా ఆంక్షలు సృష్టించారన్నారు. సమావేశాన్ని ఫెయిల్యూర్ చేయాలని మంత్రి స్వామి ఆదేశాలతో టీడీపీ కార్యకర్తలుగా మారిన పోలీసులు సమావేశానికి వచ్చే ప్రతి ఒక్కరినీ ఇబ్బందులకు గురిచేశారన్నారు. కొంతమంది నాయకుల కార్యకర్తల ఫోన్లను తీసుకొని బెదిరింపులకు గురి చేశారని, అయినా నాయకులు లెక్క చేయకుండా భారీ సంఖ్యలో పాల్గొన్నారని చెప్పారు. నియోజకవర్గంలో కూటమి సృష్టించే ఆగడాలకు అదుపు లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3 లక్షల మంది విద్యార్థుల సంఖ్య తగ్గిందంటే విద్యా వ్యవస్థ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం పనితీరు ఇట్టే కనిపిస్తోందన్నారు. వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని, ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరి పేరును మీకు నచ్చిన బుక్కులో రాసుకోండని దానికి తప్పనిసరిగా ప్రతీకారం ఉంటుందని ఆయన కార్యకర్తలకు హామీ ఇచ్చారు. కార్యకర్తలపై ఎన్ని అక్రమ కేసులు బనాయించినా వాటిని దీటుగా ఎదుర్కొంటామన్నారు.



జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మహిళలపై హామీల జల్లు కురిపించిందని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు పూర్తి స్థాయిలో పథకాలు అమలు చేయకుండా నట్టేట ముంచిందన్నారు.

ఒంగోలు పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు మాటలతో ప్రజలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అన్నారు. మిర్చి, పొగాకుతో పాటు మరి కొన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులను దగా చేశాడన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ కూటమి ప్రభుత్వానికి అనుబంధ సంస్థగా మారిందన్నారు.

ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నిస్తే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అరాచక పాలనను రాష్ట్ర ప్రజలకు గమనిస్తున్నారని సరైన సమయంలో తప్పక బుద్ధి చెబుతానన్నారు బుద్ధి చెబుతారన్నారు.

కార్యక్రమంలో డాకా పిచ్చిరెడ్డి, బచ్చల కోటేశ్వరరావు, బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, మారెడ్డి వెంకటాద్రి రెడ్డి, శేషారెడ్డి, మురళి, మండవ మాలకొండయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, వేముల రమేష్, బొక్కిసం సుబ్బారావు, వసంతరావు, మణికంఠేశ్వర్ రెడ్డి, రామకృష్ణ, జెడ్పీటీసీ అరుణ వెంకటాద్రి, ఇనకొల్లు సుబ్బారెడ్డి, మసనం వెంకట్రావు, చింతపల్లి హరిబాబు, దుద్దుగుంట మల్లికార్జున్ రెడ్డి, పిన్నిక శ్రీనివాసులు, బెజవాడ వెంకటేశ్వర్లు, మురళి, భువనగిరి సత్యనారాయణ, ఆరు మండలాల ఎంపీటీసీలు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పార్టీలో వివిధ విభాగాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయండి

- ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ



ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్ నుంచి వీడియో సమావేశం ద్వారా రెవెన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్లు, ప్రాజెక్టు అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 565, ఎన్‌హెచ్ 216, ఎన్‌హెచ్ 544, ఎన్‌హెచ్ 167బి, ఎన్‌హెచ్ 765, ఎన్‌హెచ్ 544జి, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్, తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ పురోగతిపై అధికారులతో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. సంబంధిత ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ల్యాండ్‌క్లెయిమ్స్, పెండింగ్ క్లెయిమ్స్‌ను పూర్తి చేయాలన్నారు. భూ సేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అవార్డులను పాస్ చేయాలన్నారు. రెవెన్యూ సంబంధిత ప్రాజెక్టుల అధికారులతో సమన్వయం చేసుకుని భూ సేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు.

రైతులకు రైతు ఉత్పత్తిదారుల సంస్థ అండగా ఉండాలి

ఒంగోలు వన్‌టౌన్: రైతులకు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో జీవనోపాధులు పెంపొందించడంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ అండగా ఉండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ టీ నారాయణ సూచించారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని టీటీడీసీలో జిల్లాలోని 12 మండలాల ఎఫ్‌పీఓ-కమ్యూనిటీ కోఆర్డినేటర్స్, ఫార్మర్ మిత్రాలు, ఎఫ్‌పీఓ అకౌంటెంట్లతో శుక్రవారం పీడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు, మునగ సాగు, వెదురు సాగు, తేనెటీగల పెంపకం, కొర్రమీను చేప పెంపకం తదితర సబ్ సెక్టార్లకు 50 శాతం సబ్సిడీని చిన్న, సన్న కారు రైతులకు అందజేయాలని పీడీ తెలిపారు. షేడ్ నెట్ కల్టివేషన్, సోలార్ డ్రైయర్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసెఫ్, ఉద్యాన వన శాఖ అధికారి డీ సంధ్యారాణి, డీ ఝాన్సీరాణి, జేపీఈ ఏపీసీఎన్ఎఫ్ లక్ష్మీరెడ్డి, అడిషనల్ పీడీ డి.దానం, జీవనోపాధుల డీపీఎం జే నారాయణ, లైవ్‌లీ హుడ్ యూనిట్ జిల్లా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నారాయణ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


మృతి చెందిన రామ్‌భూపాల్‌రెడ్డి

రాచర్ల: వ్యవసాయ బోరు స్టార్టర్ బాక్స్ వద్ద ఫ్యూజులు తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురైన రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన రాచర్ల మండలంలోని ఒద్దులవాగుపల్లె గ్రామ వ్యవసాయ పొలాల్లో శుక్రవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అన్నపురెడ్డి రామ్‌భూపాల్‌రెడ్డి(61) ఒద్దులవాగుపల్లె-సత్యవోలు మార్గంలో ఉన్న తన పొలంలో 10 రోజుల క్రితం మొక్కజొన్న సాగు చేశారు. మొలక దశలో ఉన్న పంటను అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు గురువారం రాత్రి 10 గంటల సమయంలో మైకు ఏర్పాటు చేసి ఇంటికి వచ్చారు. మైకును తిరిగి ఇంటికి తెచ్చుకునేందుకు శుక్రవారం వేకువజామున బైక్‌పై పొలానికి వెళ్లారు. డీప్‌బోర్ స్టార్టర్ బాక్స్ ఫ్యూజులు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. రామ్‌భూపాల్‌రెడ్డి ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య లక్ష్మీదేవి పొలం వద్దకు వెళ్లి చూసింది. విగతజీవిగా పడి ఉన్న రామ్‌భూపాల్‌రెడ్డిని చూసి బోరున విలపిస్తూ బంధువులకు సమాచారమిచ్చింది. ఎస్సై పి.కోటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రైల్వే స్టేషన్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు


రైలు బోగీలో బ్యాగులను పరిశీలిస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ఒంగోలులో శుక్రవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈగిల్ టీం, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులతోపాటుగా పోలీసు డాగ్ స్క్వాడ్‌తో కలిసి రైల్వే స్టేషన్ పరిసరాలు, రైలు బోగీలలో విస్తృతంగా తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్‌లోని పార్సిల్ సర్వీసు సెంటర్లో అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి పార్సిల్‌ను పరిశీలించారు. ఒంగోలు మీంచి వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లోని బోగీలలో ఎక్కి అనువణువు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నగరంలోని అన్నీ ప్రధాన కూడళ్లతో పాటుగా రైల్వే స్టేషన్లోనూ తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇలువంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలపై సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 11972, స్థానిక పోలీసులు, డయల్ 112 , పోలీసు వాట్సప్ నంబర్ 9121102266కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ తనిఖీలో మహిళా పీఎస్ సీఐ సుధాకర్, టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, జీఆర్పీ సీఐ షేక్ మౌలా షరీఫ్, ఆర్పీఎఫ్ సీఐ కొండయ్య, ఈగల్ టీం, ఎస్సైలు పాల్గొన్నారు.

టంగుటూరులో దొంగలు హల్‌చల్

- 4 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ


టంగుటూరులో ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై, క్లూస్ టీం

టంగుటూరు: తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దుండగులు బంగారు ఆభరణాలు అపహరించిన సంఘటన టంగుటూరు పురం సెంటర్లో గురువారం చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. స్థానిక పురం సెంటర్లో నివాసం ఉండే బడుగు దీనదాసు కుటుంబ సభ్యులు నిమ్మకూరు గ్రామంలో చదువుతున్న కూతురు వద్దకు ఉదయం వెళ్లి రాత్రి ఇంటికి ఇంటికి వచ్చారు. తలుపులు తెరిచి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. దుండగులు బీరువా పగలగొట్టి సుమారు నాలుగు సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేశారని స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య, ఎస్సై నాగమల్లీశ్వరరావు పరిశీలించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

న్యాయం కావాలి.. నిందితులను శిక్షించాలి


మృతి చెందిన లక్షిత్(ఫైల్)

- చిన్నారి లక్షిత్ మృతి కేసు దర్యాప్తుపై బంధువులు, గ్రామస్తుల ఆగ్రహం
- కంభం పోలీస్ స్టేషన్ ఎదుట లింగోజీపల్లి వాసుల ఆందోళన
- రెండు ట్రాక్టర్లలో వస్తున్న మహిళలకు మధ్యలోనే నచ్చజెప్పేందుకు పోలీసుల యత్నం
- కేసు విచారణ కాకుండానే సాధారణ మృతి అని ఎలా చెబుతారని ఆగ్రహం
- అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యంపై నిప్పులుచెరిగిన స్థానికులు
- విచారణ పూర్తయ్యాక పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న సీఐ మల్లికార్జున
- 45 గంటల పాటు బాలుడు ఎక్కడున్నాడన్న దానిపై పలు అనుమానాలు


ఎస్పైతో మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు

కంభం:

మూడేళ్ల బాలుడు పాదిలి లక్షిత్ అనుమానస్పద మృతి కేసులో తమకు న్యాయం చేయాలంటూ కంభం పోలీస్‌స్టేషన్ ఆవరణలో కుటుంబ సభ్యులు, లింగోజీపల్లి గ్రామస్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. కంభం మండలం లింగోజీపల్లిలో మంగళవారం ఉదయం 11 గంటలకు అంగన్‌వాడీ కేంద్రం నుంచి అదృశ్యమైన లక్షిత్ గ్రామానికి 3 కి.మీ దూరంలో సూరేపల్లి శివార్లలో ఉన్న పంటపొలాల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. బాలుడి మృతిపై సీఎం చంద్రబాబు ఆరా తీయగా.. అడవిలో చిక్కుకున్న బాలుడు ఆహారం, నీరు లేక మృతి చెంది ఉంటాడని ప్రాథమిక అంచనాకు వచ్చామని జిల్లా పోలీస్ అధికారులు చెప్పినట్లు కొన్ని మీడియా చానళ్లు, దినపత్రికల్లో(సాక్షి కాదు) వార్తలొచ్చాయి. దీంతో ఆగ్రహించిన బాలుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు.

ట్రాక్టర్లలో తరలివచ్చిన మహిళలు

బాలుడి మృతిపై న్యాయం జరగడం లేదని ఆగ్రహించిన మహిళలు, గ్రామస్తులు రెండు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై పోలీస్‌స్టేషన్‌కు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు మార్గమధ్యంలో వారిని అడ్డుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులతో వాదించిన గ్రామస్తులు అక్కడి నుంచి కంభం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బైఠాయించారు. కేసు ప్రాథమిక దర్యాప్తులో ఉండగా పోలీసులు


లింగోజీపల్లి నుంచి రెండు ట్రాక్టర్లలో కంభం పోలీస్‌స్టేషన్‌కు వస్తున్న మహిళలు

ఇచ్చిన స్టేట్‌మెంట్ చూస్తుంటే తమకు న్యాయం జరుగుతుందని అనిపించడం లేదని ఆగ్రహావేశాలకు లోనయ్యారు. బాలుడిని ఎవరు ఎత్తుకెళ్లారో, ఎందుకు చంపారో విచారించి నిందితులను శిక్షించి మాకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మా బాబు తప్పిపోలేదు.. ఎవరో ఎత్తుకెళ్లారు

తన కొడుకు లక్షిత్ తప్పిపోలేదని ఎవరో పథకం ప్రకారం ఎత్తుకెళ్లి హత్య చేశారని తల్లి సురేఖ అనుమానం వ్యక్తం చేశారు. ఎవరు చేశారో, ఎందుకు చేశారో కనిపెట్టాలని, సాధారణ మృతిగా మార్చేందుకు ఎవరో ప్రయత్నిస్తున్నారని వాపోయారు. 'నా కొడుకు ఎలాగూ నాకు దక్కలేదు, ఇంకో తల్లికి ఇలా జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాల'ని కోరారు. పెద్దవాళ్లే దిగి ఎక్కలేని వాగును చిన్న పిల్లాడు ఎలా దాటతాడని, కేసును తప్పు దోవ పట్టించాలన్న ఉద్దేశంతోనే హంతకులు అక్కడ చెప్పులు పెట్టి ఉంటారని లక్షిత్ అమ్మమ్మ అనుమానం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ నిర్లక్ష్యంపై ఆగ్రహం

అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న ఐదుగురు పిల్లల్లో ఒక బాలుడు అదృశ్యమై మృతి చెందిన నేపథ్యంలో అక్కడ పనిచేస్తున్న సిబ్బందిపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లవాడి మరణానికి పరోక్షంగా వారు కూడా కారకులని నిప్పులు చెరిగారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.


మార్గమధ్యంలో ట్రాక్టర్లు ఆపేసిన పోలీసులతో గ్రామస్తుల వాగ్వివాదం

? 45 గంటలపాటు బాలుడు ఏమయ్యాడు

మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో అదృశ్యమైన బాలుడు 45 గంటల తర్వాత విగతజీవిగా కనిపించాడు. లింగోజీపల్లి నుంచి సంఘటనా స్థలం ప్రాంతానికి చేరుకోవాలంటే మధ్యలో నల్లవాగు దాటాలి. ఈ నేపథ్యంలో బాలుడు ఒంటరిగా వెళ్లి ఉంటాడన్న వాదనను కొట్టిపడేస్తున్నారు. రెండో రోజు నల్లవాగు వద్ద బాలుడి చెప్పులు కనుగొన్న పోలీసులు చుట్టుపక్కల పంటపొలాలు, పరిసరాలను డ్రోన్ కెమెరాలతో జల్లెడ పట్టారు. డాగ్ స్క్వాడ్‌తో పాటు గ్రామస్తులు ఆ ప్రాంతంలో అడుగడుగూ తిరిగినా ఆచూకీ లభించలేదు. బాలుడి మృతదేహం లభ్యమైన ప్రదేశంలో ముందురోజు ఏమీ కనబడలేదు. బాలుడు తప్పిపోయిన మొదటి రాజు రాత్రి సుమారు గంటకు పైగా భారీ వర్షం కురిసింది. బాలుడు నిజంగా తప్పిపోయి వచ్చి ఉంటే ఆ వర్షంలో ఎక్కడ ఉన్నాడు?, రెండు రాత్రులు ఎలా గడిచాయన్న ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. బాలుడు అదృశ్యమైన కొంత సమయానికే పోలీసులు, గ్రామస్తులు చుట్టుముట్టడంతో కిడ్నాపర్లే అంతమొందించి ఉంటారన్న అనుమానాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి.

బాలుడి కుటుంబానికి 'అన్నా' పరామర్శ


బాలుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

లింగోజీపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి అదృశ్యమై పంట పొలాల్లో శవమై తేలిన బాలుడు పాదిలి లక్షిత్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు శుక్రవారం పరామర్శించారు. తీరని వేదనతో కుమిలిపోతున్న లక్షిత్ తల్లిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. అభ్యం పుణ్యం ఎరుగని బాలుడి అనుమానాస్పద మరణం తనను కలచివేసిందని, ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలన్నారు. ఆయన వెంట ఎల్‌కోట సర్పంచ్ బాషా, ఎంపీటీసీ రావూరి రవి, జగన్, బొల్లు రాములు ఉన్నారు.

కేసు దర్యాప్తు కొనసాగుతోంది

ఒంగోలు జీజీహెచ్‌కు చెందిన ప్రొఫెసర్‌తో బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం చేయించాం. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. పోస్టుమార్టం నివేదిక వస్తే సహజ మరణమా లేక బలవన్మరణమా అనే విషయం తెలుస్తుంది. బాలుడి అనుమానాస్పద మృతి కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నాం. దర్యాప్తు పూర్తయితే వివరాలు వెల్లడిస్తాం.

– మల్లికార్జునరావు, కంభం సీఐ

అడుగడుగునా ఆంక్షలు..

- వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని అడ్డుకోవడానికి విశ్వ ప్రయత్నాలు
- మంత్రి ఆదేశాలతో నలుమూలల చెక్ పోస్టులు, తనిఖీలు
- అయినా భారీగా హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొండపి: కొండపిలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని అడ్డుకోవడానికి మంత్రి ఆదేశాలతో పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేశారు. గురువారం రాత్రి నుంచి ఆటంకాలు సృష్టిస్తూ అడ్డుకోవడానికి ప్రయత్నించారు. భారీగా సమావేశం నిర్వహించడాన్ని జీర్ణించుకోలేని మంత్రి స్వామి ఎలాగైనా తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని సమావేశం జరగకుండా చేయాలని కుట్రలు పన్నారు. దీనికి పోలీసులతో అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. ఫ్లెక్సీలు కడుతున్న వారిని అడ్డుకొని వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరు చెబితే ఫ్లెక్సీలు కట్టారు, ఫ్లెక్సీలు కడితే మీ మీద కేసులు నమోదు చేస్తామని బెదిరించారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి సురేష్ వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పోలీసులతో మాట్లాడారు. ఎటువంటి ప్రభుత్వాన్ని కించపరిచే ఫ్లెక్సీలు లేనప్పుడు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం నుంచి కొండపికి నలుమూలల ఎనిమిది చోట్ల చెక్‌పోస్టులు పెట్టి తనిఖీలు నిర్వహించారు.


సీఐ తో మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్

కొండపి నుంచి టంగుటూరు వెళ్లే గురుకుల పాఠశాల సమీపంలో ఒకటి, కే.ఉప్పలపాడు వద్ద, కామేపల్లి వెళ్లే రోడ్డులో హోసన్న చర్చి దగ్గర ఒకటి, పొదిలి వెళ్లే రోడ్డులో ఫైర్ స్టేషన్ దగ్గర, సంతనూతలపాడు వెళ్లే రోడ్డులో పోలీస్ స్టోరేజ్ వద్ద, జాళ్లపాలెం వెళ్లే రోడ్డులో జండా చెట్టు సెంటర్ వద్ద, కొండపి టౌన్లోని కామేపల్లి సెంటర్లో, ఎన్టీఆర్ సర్కిల్ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా వస్తున్న వారందరినీ కూడా ఒకే కారులో రావాలని అడ్డుకున్నారు. ద్విచక్ర వాహనాలపై వచ్చే వారిని హెల్మెట్ లేదనే కారణంతో వెనక్కి తిప్పి పంపించారు. ఎన్నడూ లేని విధంగా హెల్మెట్లు, వాహన పత్రాలు తనిఖీ చేయడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆటోలను, కార్లను ఆపి తనిఖీలు చేశారు. మీకు కొండపిలో ఏం పని? ఈ సమయంలో కొండపి కి ఎందుకు వెళ్తున్నారు? విస్తృత స్థాయి సమావేశానికి వెళితే తిరుగు ప్రయాణంలో మీ మీద చర్యలు తీసుకుంటామని వాహనదారులను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. సమావేశానికి రాకుండా కార్యకర్తలను ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. కొంత మంది కార్యకర్తల మొబైల్ ఫోన్‌లు తీసుకొని సమావేశానికి రాకుండా ఆటంకపరిచారు. అయినా కార్యకర్తలు ఇవేవీ లెక్కచేయకుండా తమ వాహనాలను కొండపికి రెండు కిలో మీటర్ల దూరంలోనే నిలిపి నడుచుకుంటూ సమావేశ స్థలానికి చేరుకున్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వేలాది మంది కార్యకర్తలు సమావేశానికి హాజరయ్యారు.


బారికేడ్లు పెట్టి జనం రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ఇద్దరు మాజీ సైనికుల గృహాల్లో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు అపహరణ


చోరీ జరిగిన గృహంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్


సీసీ కెమెరాలో నిక్షిప్తమైన అనుమానితుడు

కంభం: ఇద్దరు మాజీ సైనికుల గృహాల్లో దొంగలు పడి బంగారు నగలు, నగదు అపహరించారు. ఈ సంఘటనలు శుక్రవారం కంభం పట్టణంలో చోటుచేసుకున్నాయి. వివరాలు.. బస్టాండ్ సమీపంలోని రహమత్‌నగర్ మొదటి లైనులో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు చల్లా కోటయ్య కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో బేస్తవారిపేట మండలంలోని సలకలవీడు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. మూడు బంగారు ఉంగరాలు, చెవి పోగులు, కమ్మలు సహా మొత్తం 3 తులాల బంగారం, రూ.2 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఉదయం 10.30 గంటల తర్వాత ఓ వ్యక్తి మాస్క్ పెట్టుకొని వచ్చి వెళ్లినట్లు సమీపంలోని సీసీ కెమెరాలో నిక్షిప్తమై ఉంది.

☛ ఎల్‌బీఎస్ నగర్‌లో నివాసం ఉంటున్న మరో మాజీ సైనికుడు రంగనాయకులు పది రోజుల క్రితం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. కింద ఇల్లు ఖాళీగా ఉండగా పైన వారు నివాసం ఉంటున్నారు. శుక్రవారం పైన ఇంటి కటాంజనం కొంత తెరుచుకొని ఉండటాన్ని గమనించిన స్థానికులు పైకి వెళ్లి చూడగా తాళం పగలగొట్టి ఉంది. యజమానులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఇంటి లోపలికి ప్రవేశించిన దొంగలు బీరువా తలుపు పూర్తిగా విరగగొట్టి మంచం మీద పెట్టారు. బీరువాలో ఉన్న వస్తువులన్నీ చిందరవందరగా పడేశారు. సుమారు మూడున్నర తులాల బంగారు నగలు, రూ.10 వేల వరకు నగదు చోరీ అయినట్లు యజమానులు చెప్పారు. చోరీ జరిగిన రెండు గృహాలను ఎస్సై నరసింహారావు పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు.

రైలు ఢీకొని గొర్రెల కాపరి మృతి


ప్రమాదంలో మృతి చెందిన రాధాకృష్ణ

రాచర్ల: ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో గొర్రెల కాపరితోపాటు 10 జీవాలు మృతి చెందాయి. ఈ సంఘటన రాచర్ల మండలంలోని యడవల్లి రైల్వే స్టేషన్ సమీపంలో 199–10 మైలు రాయి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. రాచర్ల మండలం రంగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొత్తకోట రాధాకృష్ణ(38) తన 50 గొర్రెలను మేత కోసం సత్యవోలు వ్యవసాయ పొలాల్లోకి తీసుకెళ్తున్నాడు. గొర్రెల మందను రైల్వే ట్రాక్ దాటిస్తున్న సమయంలో గుంటూరు నుంచి ఔరంగబాద్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకొచ్చింది. గొర్రెలను పక్కకు తోలేందుకు ప్రయత్నించిన రాధాకృష్ణను రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇదే ప్రమాదంలో 10 గొర్రెలు మృతి చెందగా, 5 గొర్రెలు తీవ్ర గాయాలతో ట్రాక్ పక్కన ఎగిరిపడ్డాయి. ప్రమాదాన్ని గమనించిన రైల్వే గార్డు ఎక్స్‌ప్రెస్‌ను నిలిపి, ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న రాధాకృష్ణను అదే రైలులో గిద్దలూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నంద్యాల జీఆర్పీ కానిస్టేబుల్ షేక్.ఖలీల్ తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.


సంఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న గొర్రెల కళేబరాలు

గ్రానైట్ రాయి కింద పడి కూలీ మృతి


కుష్వాహా(ఫైల్)


రాయి కింద నలిగిపోయిన కుష్వాహా

పొదిలి రూరల్: గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తుండగా రాయి జారి మీద పడటంతో ఓ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పొదిలి మండలంలోని ఏలూరు పంచాయతీ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఏలూరు పరిధిలోని వర్ణ గ్రానైట్ ఫ్యాక్టరీలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుదమా కుష్వాహా(33) గత కొంత కాలం నుంచి పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే కటింగ్ మెషీన్‌తో భారీ గ్రానైట్ రాయిని కోసేందుకు సిద్ధం చేస్తున్న సమయంలో జారిపడింది. రాయి మీద పడటంతో కుష్వాహా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తోటి కార్మికులు గమనించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేద కుటుంబాన్ని దత్తత తీసుకున్న ఇన్‌చార్జి కలెక్టర్


మరియమ్మ కుటుంబంతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ, పక్కన సర్పంచ్

మద్దిపాడు: మండలంలోని మల్లవరం గ్రామంలో నివాసం ఉంటున్న శింగమనేని మరియమ్మ కుటుంబాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ శుక్రవారం దత్తత తీసుకున్నారు. మరియమ్మ భర్త చనిపోగా ఆమె తన కుమార్తె, కుమారునితో కలిసి తల్లి వద్దనే ఉంటూ పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో ఆమె కుటుంబాన్ని దత్తత తీసుకోవడానికి ఇన్‌చార్జి కలెక్టర్ ముందుకు వచ్చారు. మరియమ్మ కుమార్తె ఇంటర్ చదువుతుండగా, అబ్బాయి 9వ తరగతి హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాడు. కుమార్తెను ఏదైనా ఒకేషనల్ కోర్సులో చేర్పించి ఉద్యోగం వచ్చేలా తాను చూసుకుంటానని గోపాలకృష్ణ హామీ ఇచ్చారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఇల్లు ఇప్పిస్తానని, దానికి అదనంగా అవసరమైతే తాను డబ్బుఖర్చు చేస్తానని తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ మరియమ్మ ఇంటికి వెళ్లే క్రమంలో ఆ కుటుంబానికి కావలసిన రేషన్, కూరగాయలు, ఇతర వస్తువులు తాను స్వయంగా కొనుగోలు చేసి అందించారు. కార్యక్రమంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న, గ్రామ సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, ఎంపీడీఓ వి జ్యోతి సచివాలయ సిబ్బంది పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నగరంలో మెడికల్ షాపుల తనిఖీలు

ఒంగోలు టౌన్: ఔషధ నియంత్రణ అధికారులు నగరంలో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు, బాపట్ల, మార్కాపురం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల బృందం జీజీహెచ్, సుందరయ్య భవన్ రోడ్డు, కొత్తపట్నం సెంటర్, 60 అడుగుల రోడ్డు పరిసరాల్లోని 9 మెడికల్ షాపులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కొన్ని నిబంధనల ప్రకారం ఫార్మాసిస్ట్ లేకుండానే మెడికల్ షాపులను నిర్వహించడం, బిల్లులను ఇవ్వకుండానే ఔషధాలను విక్రయించడం వంటివి గుర్తించినట్లు అసిస్టెంట్ డైరక్టర్ జ్యోతి తెలిపారు. కొన్ని మెడికల్ షాపుల నుంచి జనరల్, జనరిక్ ఔషధాలకు సంబంధించిన శాంపిల్స్‌ను సేకరించినట్లు చెప్పారు. నిబంధనలను ఉల్లంఘించిన షాపులకు నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సీఎస్‌పురం(పామూరు): రోడ్డు ప్రమాదంతో గాయపడిన యువకుడు తిరుపతి వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై ఎం.వెంకటేశ్వరనాయక్ కథనం మేరకు.. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సీతారామపురానికి చెందిన సురేష్(32), వినోద్ గురువారం పామూరులోని బంధువుల ఇంటికి వచ్చి, రాత్రి వేళ బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. అయ్యలూరివారిపల్లె సమీపంలో జాతీయ హైవేపై గేదెలు అడ్డురాగా బైక్ అదుపుతప్పి పడిపోవడంతో సురేష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. ఉదయగిరి వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో యువకుడు వినోద్‌కు స్వల్పగాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.